ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

# ఎన్నెలనవ్వు నవల యానాదుల జీవనచిత్రం

**డా. పొనుగోటి రవికుమార్,**

తెలుగు విభాగాధిపతి,అసోసియేట్ ప్రొఫెసర్,యస్.ఆర్ & బి.జి.యన్.ఆర్.

ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (A++),

ఖమ్మం.

Article Received: 02/01/2025 Article Accepted: 25/01/2025 Published Online: 26/01/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2.1.168

## పరిచయం:

ఎన్నెలనవ్వు నవలలో ఏకుల వెంకటేశ్వర్లు యానాదుల జీవనగమనాన్ని వాస్తవికంగా చిత్రీకరించాడు. గిరిజనుల జీవితానుభవాల ఆధారంగా గిరిజనేతరులు నవలను సృజించారు. 'చివరి గుడిసె' నవలలో యానాదుల బ్రతుకులను కేశవరెడ్డి తెలియజేశారు. నేడు ఆయన సృజన గురించి ప్రత్యేకంగా చెప్పవలసిన పనిలేదు. కానీ ఇ.వి. గురించి ప్రత్యేకంగా ఎందుకు చెప్పుకోవాలంటే ఇప్పటివరకు యానాదుల జీవితానుభవాలను చిత్రించిన నవల తెలుగులో రాలేదు. ఎన్నెలనవ్వు ద్వారా ఆ లోటును ఇ.వి తీరుస్తున్నాడు. ఈ విధంగా ఎన్నెలనవ్వు నవలకు తెలుగు సాహిత్యంలో గొప్ప చారిత్రక ప్రాధాన్యత కోయి కోటేశ్వరరావు ఎన్నె లనవ్వు ముందుమాటలో వ్యాఖ్యానించారు. పై వ్యాఖ్యానాన్ని రుజువుచేసే అనేక అంశాలను రచయిత లోతుగా చర్చించాడు. యానాదుల ఆర్థిక, సామాజిక, జీవన స్థితిగతులను ఇ.వి. పరిశీలనాత్మకంగా రచించాడు. యానాదుల సాంస్కృతిక ఔన్నత్యాన్ని, వారి ఆచార వ్యవహారాల్లోని విశిష్టతను, ఆటపాటలను, ఆత్మగౌరవస్ఫోరకంగా రచయిత నిరూపించాడు. పేదరికానికి అనుగుణంగా యానాదితెగల ఆహారపు అలవాట్లు, ఆచారవ్యవహారాలను, కట్టుబాట్లను ఈ నవలలో రచయిత సూక్ష్మ వివేచన చేసి ఎరుకపరిచాడు.

యానాదులకు నవ్వంటే ఇష్టం. వారి రోజువారీ పనుల్లో హాస్య చతురత కూడిన అంశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే ఆ నవ్వులను చూసిన వారు 'తాటాకులపై ఇసుకపోసి యానాదులు నవ్వుకుంటారని' ఎగతాళి చేస్తుంటారు. ఇది ఎగతాళి అయినప్పటికీ కాల్మషం లేని యానాదులు చిన్నచిన్న విషయాలకు కూడ అమాయకంగా, స్వచ్ఛంగా హాయిగా నవ్వుకోవడం గమనించవచ్చు. అలాంటి యానాదుల బతుకుల్లో వివక్షత చీకట్లు మాసిపోయి, వెన్నెల కురిచి ఆనందం వెల్లివిరిచి నవ్వుల పంటలు పండాలని రచయిత ఆకాంక్షించి నవలకు 'ఎన్నెలనవ్వు' అనే పేరు పెట్టడని చెప్పుకోవచ్చు.

**గిరిజనులు:** గిరిజనులు అంటే గిరులు, కొండ, కోనలలో నివసించేవారని అర్థం. వీరిని ఆదివాసులని కూడ పిలుస్తారు. గిరిజనులు అనే మాట కన్నా ఆదివాసులు అనే మాటను చారిత్రకార్థంలోను, గౌరవార్థంలోను విస్తృతంగా సామాజికవేత్తలు వాడుతున్నారు. ఈ దేశంలో ఆది నుంచి నివసిస్తున్నవారు కనుక ఆదివాసీయులని భావిస్తున్నారు. అటవీప్రాంతాల్లో, నాగరిక సమాజానికి దూరంగా నివసిస్తున్న వారిని గిరిజనులుగా భారత రాజ్యాంగం గుర్తించింది. కాని కేవలం నాగరిక ప్రపంచానికి దూరంగా అడవుల్లో లేదా కొండల్లో నివసిస్తే గిరిజనులు అవుతారా? అనే ప్రశ్న రావచ్చు. కానీ జాతిపరంగాను, సాంస్కృతిక పరంగాను, భాషా పరంగాను, ఆహారపు అలవాట్ల పరంగాను వీరికంటూ కొన్ని ప్రత్యేక ఆచార వ్యవహారాలు, నమ్మకాలు ఉంటాయి. అలా ఉన్న వారిని గిరిజనులు అంటారని అనవచ్చు.

**గిరిజన తెగలు**: తెలుగు ప్రాంతంలో గిరిజన తెగలు మొత్తం 35 ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆయా తెగలను వృత్తులు, జీవనరీతులను ఆధారంగా చేసుకొని వర్గీకరించారు. అయితే 2002కి పూర్వం తెలుగు రాష్ట్రాలలో 33 తెగలు ఉన్నాయి. షెడ్యూల్డ్ తెగల జాబితాలో 32వ కులంగా యానాదులు ఉన్నారు. అయితే 2002లో రెండు తెగలను గిరిజన జాబితాలో చేర్చడం జరిగింది. తెగలను షెడ్యూల్ జాబితాలో చేర్చాలంటే ఆదిమ సమాజపు ఆనవాళ్ళు, విశిష్ట సంస్కృతి, భౌగోళికదూరం, ప్రధానస్రవంతి జనంతో కలవలేని బిడియం మొదలైనవి రాజ్యాంగం నిర్దేశిస్తున్న లక్షణాలని చెప్పవచ్చు. పై లక్షణాల ఆధారంగా 34వ తెగగా 'నక్కలవారు', 35వ తెగ 'దూలియ' గా గుర్తించారు. గిరిజనులను మైదాన ప్రాంత గిరిజనులు, ఏజెన్సీప్రాంత గిరిజనులు అని కూడ విభజించారు. అందులో 68 శాతం గిరిజనులు షెడ్యూల్ ప్రాంతాలో నివసిస్తుండగా మిగిలిన 32 శాతం మంది గిరిజనులు గిరిజనేతరులతో కలసి మైదానప్రాంతంలో నివసిస్తున్నారు.

**ఏజెన్సీ ప్రాంత గిరిజనులు**: కొండ ప్రాంతాల్లో, దట్టమైన అడవుల్లో పరిసర పల్లపు ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులను ఏజెన్సీ ప్రాంత గిరిజనులు అంటారు. చెంచులు, గోండులు, భిల్లులు, కొండరెడ్లు, కోయవారు, మన్నెదొరలు, నాయక్పోడులు, రెడ్డిదొరలు మొదలైనవారు నివసిస్తున్నారు.

**మైదాన ప్రాంత గిరిజనులు**: మైదాన ప్రాంతాల్లో, గ్రామాల్లో నాగరిక సమూహాలకు దగ్గరగా గిరిజనేతరులతో కలసి నివసించే గిరిజనులను మైదానప్రాంత గిరిజనులు అంటారు. యానాదులు, ఎరుకల, లంబాడీలు లేక సుగాలీలు, మొదలైన గిరిజనతెగలు మైదానప్రాంతాల్లో నివసిస్తున్నారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

**గిరిజన సంస్కృతి**: తెలుగు ప్రాంతంలో గిరిజనుల సంస్కృతి విభిన్న సంస్కృతుల మేలు కలయిక. ఒక్కో తెగకు ఒక్కో సంస్కృతి ఉంటుంది. సంస్కృతి అంటే ఆట, పాట, వేషం, నృత్యం, జీవనవిధానం లాంటివి మాత్రమే కాదు. భాషా, సామాజిక వ్యవస్థ, ఆర్థిక విధానాలు, మతం, విద్య, ఆహారపు అలవాట్లు మొదలైనవి కూడా సంస్కృతిలో భాగంగా చెప్పవచ్చు. తెగలను అనుచరించి ఆయా గిరిజనుల సంస్కృతి ప్రత్యేకంగా ఉంటుంది. అడవుల్లో ఉంటూ వారి వేష భాషలు, ఆహారపు అలవాట్లు, పెళ్ళిళ్ళు, జీవనవిధానం మొదలైనవి వారి పురాతనమైన సంస్కృతికి అద్దం పట్టేవిధంగా ఉంటాయి.

**యానాది తెగలు**: యానాదుల్లో మనకు ప్రధానంగా నాలుగు తెగలు కనిపిస్తాయి. అవి 1.రెడ్డియానాదులు, 2.చెల్లయానాదులు,3. అడవియానాదులు, 4. తూర్పుయానాదులు.

### ఎన్నెలనవ్వు- యానాదుల ఆచార వ్యవహారాలు:

యానాదులు ఆంధ్రప్రదేశ్ లో ముఖ్యంగా నెల్లూరు అడవుల నుండి సముద్రతీర ప్రాంతం వరకు విస్తరించిన సంచార గిరిజన తెగ యానాదులు. నెల్లూరుజిల్లాలో వీరి సంఖ్య అధికంగా కనిపిస్తుంది. తెలంగాణ రాష్ట్రం మహబూబునగర్ జిల్లా నల్లమల్ల అటవీప్రాంతంలో కనిపిస్తారు. 'సామాజిక పరిమాణంలో ఆహారసేకరణకు చెందిన జాతి. వారి చుట్టున్న సమాజం, వివిధ దేశాలను దాటుకుంటూ, స్థిర వ్యవసాయ జీవితంలోకి స్థిరపడిన వందల ఏళ్ల తరువాత కూడా యానాదులు తమ ప్రాచీన విశ్వాసాలను అంటిపెట్టుకొని ఉండిపోయారని' వాడ్రేవు చిన వీరభద్రుడు 'చివరిగుడిసె' నవల ముందుమాటలో పేర్కొన్నారు. నేటికీ యానాదులు, తమ ప్రాచీన విశ్వాసాలను వదిలిపెట్టక గిరిజనేతరులచే అనేక విధాలుగా దోపిడికి గురౌతూనే ఉన్నారు. యానాదులు భారతదేశంలో ఆర్యులు రాక ముందునుంచే తమ పుట్టుపూర్వోత్తరాలు తెలియక అమాయకులుగా అనాదిగా నివసిస్తున్నారు. ఈ విధంగా వీరిని అనాది నుంచి ఉన్నారని అందుకే 'అనాదులు' అని అన్నారు. తదనంతరం వాడుకభాషలో అనాదులే 'యానాదులు' గా పిలువ బడ్డారు.

### వేషధారణ:

వీరి రూపురేఖలు ముఖకవలికలు ఆఫ్రికన్ ప్రాంత వాసుల్లాగా ఉంటాయి. మొలువని మీసాలు, మేకపోతు గడ్డాలతో, గోచిపాతలు ధరించి, విల్లంబులు చేతబూని, గూచికర్రలతో ఎలుక కలుగుల్ని తవ్వుకుంటూ, చేపలు పట్టుకుంటూ, ఆకులు, అలములు తింటూ జీవనం గడిపేవారు. వీరిని చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, గోదావరి జిల్లాల్లో యానాదులని పిలుస్తారు. నల్లమల్ల అడవుల్లో వీరినే చెంచులు అని పిలుస్తారు. 'చెంచు కొండ దిగి యానాది అయినాడు' అని వెన్నెలకంటి రాఘువయ్యగారు పేర్కొన్నారు. యానాదులకు, చెంచులకు కొంత బేధం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ఉన్నప్పటికీ పోలికలే ఎక్కువని 31 అంశాలతో వారిరువురి మధ్య పోలికలు చెప్పాడు. అదే విధంగా కొంత వరకు భేదం కూడా ఉందని తన 'యానాది' గ్రంథంలో తెలియజేశాడు. చెంచులు అడవుల్లో ఉంటూ ఎక్కువగా వేటాడి జీవనం గడుపుతున్నారు. యానాదులు అడవి బయట మైదాన ప్రాంతంలో ఉన్న తమకు చేతనైన స్థాయిలోనే వేటాడి జీవించడానికి అలవాటు పడ్డారనవచ్చు. నవలలో ఎలాంటి వేషధారణ, భాషలు ప్రత్యేకంగా పేర్కోనలేదు. తెలుగునే యానాదులు తమ యాసలో మాట్లాడతారు.

## యానాదుల పుట్టుక ఆచారాలు:

నవలలో చెంచులు పుట్టినప్పుడు ఎలాంటి ప్రత్యేక ఆచారాలు చేసినట్లుగా రచయిత ఎక్కడా చెప్పలేదు. యానాదులలో పిల్లలు పుట్టినప్పుడు ఎటువంటి ఆర్భాటాలు చేయరు. ఒకవేళ యానాదులకు పిల్లలు పుట్టిన పుట్టకపోయినా లేక సంతానం ఎక్కువైనా వారు బాధపడరు. తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు కూడ లేని దుర్భరమైన పేదరికం వలన పిల్లల గురించి ఆలోచించనే వారిలో ఉండదనవచ్చు.

## యానాదుల పెళ్ళి, ఆచారవ్యవహారాలు:

ఈ నవలలో అలివేలు, మునెయ్యల పెళ్ళి సందర్భంగా యానాదులు పెళ్ళిలో పాటించే ఆచార వ్యవహారాలు పెళ్ళిచూపుల నుండి పెళ్ళి వరకు రచయిత వర్ణించారు. ఆదిమజాతి అయిన యానాదులలో వివాహానికి సంబంధించిన ప్రత్యేకమైన కట్టుబాట్లు, సంప్రదాయాలు కనబడవు. తాళిబొట్టు, బ్రాహ్మణ పురోహితుడు, ముహూర్తం, బంధువులకు ఆహ్వానాలు పంపడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు వీరిలో కనబడవు. యానాదులకు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండడానికి ఇల్లు లేకపోయిన ఆడ, మగ ఇష్టపడి కలిసి దాంపత్య జీవనం గడుపుతారు. ఈ విధంగా యానాది దంపతులు కలసి ఉన్నన్నాళ్లూ వీరి ప్రేమను ఎవరూ ఏమి చేయలేరు. అలివేలు నడవడిక బాగలేదని గమనించిన మంగమ్మ సిన్నాయన కొడుకులతో పెళ్ళి చేయడానికి నిర్ణయించుకున్నారు. అలివేలుకి పెళ్ళి గురించి తెలియజేస్తారు. పై అంశాల ఆధారంగా యానాదులలో మేనరిక వివాహాలు ఉన్నాయి. పెళ్ళికి ముందు అమ్మాయిల అభిప్రాయాలు తెలుసుకుంటారని రచయిత తెలియజేశారని చెప్పవచ్చు.

## పెళ్ళి-కట్నకానుకలు:

పెళ్ళిచూపుల సమయంలో యానాది సంఘం మొత్తాన్ని పిలిచారు. పెళ్ళికొడుకు వాళ్ళు మంచిరోజు చూచుకొని అమ్మాయిని చూడడానికి వచ్చారు. మేకల చెంచయ్య ఆ సంఘానికి ముదాము, అంటే సంఘపెద్ద. అందర్ని పిలిచారు. చతుర్లమధ్య పెళ్ళిసంబంధం మాట్లాడుకున్నారు. కట్నం పెండ్లికొడుకుకు బట్టలు పెట్టడమే. అమ్మాయికి అత్త పర్వతాలు ముక్కుపుడక పెట్టింది. అమ్మాయి, అబ్బాయిలు పరస్పరం మావోళ్ళు

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

అనిపించుకున్నారు. తమలపాకుల పళ్ళేలు మార్చుకున్నారు. పెద్దలు అక్షింతలు వేసి దీవించారు. పై విధంగా యానాదుల పెళ్ళిచూపులు, నిశ్చితార్థం నిరాడంబరం జరుగుతుందనవచ్చు.

**పెళ్ళి-పతాణం:**

పెళ్ళికిముందు ప్రధానం, పెళ్ళికొడుకు ఇంటినుండి పెళ్ళికూతురు ఇంటికి తీసుకువస్తారు. పతాణంతో వచ్చిన వారికి అన్నం పెట్టాలంటే ఇంట్లో బియ్యంలేవు. ఏ పూటకి ఆ పూట సంపాదించుకోవడమే యానాదులకు తెలుసు. ఇది యానాదుల ఆర్థిక పరిస్థితి. అప్పుకోసం చౌదరి ఇంటికివెళ్ళితే ఆయన భార్య ఎగతాళిగా మాట్లాడుతుంది. పని చేయించుకుని అప్పు అడిగితే డబ్బులు లేవంటుంది. చౌదరిని అడగమంటుంది. చౌదరి ఊర్లో రచ్చబండ దగ్గర మంగమ్మను, యానాదులపెళ్ళిని నలుగురిలో ఎగతాళిచేసి డబ్బులిస్తాడు. పతాణంలో పదకొండు వస్తువులు రాలేదనే గొడవ పడుతుంటే ఆపుతుంది. అందరికీ వండి పెడుతుంది. యానాదులపెళ్ళి అబ్బాయి ఇంటి దగ్గరే జరుగుతుంది. అలివేలును పతాణం చీరతో అలంకరించి పెళ్ళివిడిదికి తీసుకువస్తారు. పెళ్ళికి వచ్చేవారు తమతమ తాహతుకు తగ్గట్టుగా తలో ఒక చేయి వేసి పెళ్ళి సరుకులు సమకూర్చుతారు. ఇది యానాదులలో ఉన్న సజీవసంబంధాలను తెలియజేస్తుందనవచ్చు.

**పెళ్ళి ఏర్పాట్లు - నలుగు ప్రాధాన్యత:**

యానాదుల పెళ్ళికి ఇంటిముందు పందిరి వేసి ఏర్పాటు చేస్తారు. పెళ్లిపందిట్లో కల్లాపిచల్లి ముగ్గు వేస్తారు. ఆ ముగ్గుమీద పీటవేసి పెళ్ళికొడుక్కి నలుగుపెడతారు. నలుగులో పాటలు పాడకపోతే యానాదుల నలుగు పూర్తయినట్టు కాదు. అందుకే "ఓ రామా... జై రామా / సీతా... మా..నో(హో)కారా.../ కారుణ్య... గు... కారా...! ఈ కమలా.../ కనతల్లీ... వాకీటా/ మరి పీటా...లేపిచ్చి" అనే పాటను మునెయ్య నలుగుపాటగా పెంచలమ్మ, పర్వతాలు శ్రావ్యంగా పాడారు. పెళ్ళిలో నలుగు లేకుండా పెళ్ళి పూర్తికానట్లేనని చెప్పవచ్చు.

**పెళ్ళి-గంజికావిడి ఆచారం**: పెళ్ళికూతురు వచ్చిందని తెలిసి పిల్లలు, పెద్దలందరూ అక్కడికి వెళ్ళారు. వారితోపాటు గంజికావిడి తీసుకెళ్ళారు. ఒక ఋంగలో గంజిబువ్వ, మరోదాంట్లో నీళ్ళు ఉంటాయి. మాకు కలిగింది గంజిబువ్వే, ఆ గంజినీళ్ళే నీవూ తాగాలనే ఆచరణ రూపాన్ని యానాదులు తెలియజేయడానికి ప్రతీకాత్మకంగా, తమ స్థితిగతులను పెళ్ళికూతురికి, పెళ్ళికి వచ్చిన వారికి తెలియజేయడమే అంతిమంగా యానాదులు చెప్పదలుచుకున్న అంశం.

**పెళ్ళి- గడ్డపార ముహూర్తం**: యానాదులు గడ్డపార ముహూర్తంలో పెళ్ళి చేసుకుంటారు. గడ్డపార ముహూర్తం అంటే భూమిపై గడ్డపారనీడ ఎప్పుడు పడదో అప్పుడే తాళిబొట్టు కట్టాలి. అంటే మిట్టమధ్యాహ్నం అన్నమాట. ఆ

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ముహూర్తాన్ని సీతారాముల పెళ్ళి ముహూర్తమని యానాదులు చెప్పుకుంటారు, నమ్ముతారు. అందుకే వారు ఆ ముహూర్తాన్ని పవిత్రంగా భావిస్తారు. అందుకే 'ఇనుప గడ్డపారను నీళ్ళతో పొడిలేకుండా కడిగారు. అలికినచోట మధ్యలో గడ్డపారని నిలేశారు. గడ్డపారచుట్టూ ముగ్గుపెట్టారు'. సరిగ్గా గడ్డపార నెత్తిమీదకి పొద్దు వచ్చినప్పుడు అందరూ హడావుడి చేసి పెళ్ళి జరిపించారు. యానాదుల పెళ్ళిళ్ళు బ్రాహ్మణ పంతుళ్ళు చేయరు. కనుక యానాదుల్లో ఎవరో ఒకరు పెళ్ళితంతు జరిపిస్తారు. అలివేలు మునెయ్యల పెళ్ళి పక్కలోడు జరిపించాడు. ఈ పెళ్ళి సమయంలో పక్కలోడు వచ్చీరాని మంత్రాలతో పెళ్ళి జరిపించాడు. పెళ్ళి తర్వాత వారి అమాయకమైన నవ్వుల మధ్య చతుర్లతో అరుంధతి నక్షత్రం చూపించి పెళ్ళి ముగించాడు.

యానాదుల పెళ్ళితంతును గమనిస్తే హిందూమత ప్రభావం ప్రస్ఫుటంగా కనబడుతుంది. కానీ పెళ్ళి విషయాల్లో బ్రాహ్మణుల ప్రమేయమేమి లేదని చెప్పవచ్చు. యానాదులు కులసమాజానికి బయటవారు. కనుక వారు తెగల సంస్కృతినే ఆచరిస్తారు. అందుకే ముహూర్తాలు చూడరు, పెట్టరు. కాబట్టి యానాదులు గడ్డపార ముహూర్తాన్ని ఎన్నుకొని, దాన్ని పరమ పవిత్రంగా పాటిస్తున్నట్లు భావించవచ్చు. పెళ్ళిలో మంత్రాలు చదవడం, అరుంధతిని దంపతులకు చూపించడం, ఇవన్నీ బ్రాహ్మణీయ భావజాల ప్రభావమేనని చెప్పవచ్చు. బ్రాహ్మణత్వాన్ని ధిక్కరించే స్వరమే పక్కలోడు. ఆక్షేపణధోరణిని పక్కలోడిపాత్రలో ప్రవేశపెట్టి బ్రాహ్మణీయ భావజాల ప్రభావం నుండి యానాదులు బయటపడాలని రచయిత ఆకాంక్షగా భావించవచ్చు.

## యానాదుల ఆహారపు అలవాట్లు:

యానాదుల ఆహారపు అలవాట్లు ప్రత్యేకమైనవి. వాటికి మారుపేర్లు పెట్టుకొని ఇతరులకు అర్థంకాకుండా పిలుచుకుంటారు. అడవుల్లో కొండ ప్రాంతాల్లో ఒకప్పటి సంచార జీవులైన వీరు అడువుల్లో దొరికే ఆహారం, వివిధ కందమూలాలు, ఆకులు, అలములు తింటూ జంతువులను వేటాడుతూ, వాటి మాంసాన్ని ఆహారంగా సేకరించేవారు. కుందేళ్లను, నెమళ్లను, నేల తాబేళ్ళు, ఉడుములు, ఉడుతలు, అడవి ఎందులు, అడవికోళ్ళు, జింకలు, దుప్పులు, కొంగలు, నీటికాకులు, ఎలుకలు, కొండగొర్రెలు, చేపలు, రొయ్యలు మొదలైన వాటిని ఇష్టంగా తింటారు. వారి ఆటవిక జీవితానికి అనుగుణంగానే వారి ఆహారం ఉంటుంది. మహబూబునగర్ జిల్లాలోని యానాదులు వివిధ జంతువుల మాంసం తింటారు. ఎన్నో నెలల పాటు చెడిపోకుండా ఉండే నల్లగడ్డ, చామగడ్డ మొదలైన అనేక రకాల దుంపలు, ఆకు కూరలు వీరికి ప్రధాన ఆహారం. కలెపండ్లు, నాగజేముడు పండ్లు, ఊటిపండ్లు, కామంచి పండ్లు, నక్కెరిపండ్లు, అడవిదొండపండ్లు, పాలపండ్లు, బిక్కిపండ్లు, బీరపండ్లు, తోడింద్రపండ్లు, మొదలైనవి, వారికి అడవుల్లో ఉచితంగా లభించే పండ్లు. వీటన్నింటి కంటే యానాదులకు అత్యంత ప్రీతిపాత్రమైన ఆహారం ఎలుకల మాంసం.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

ఏకుల వెంకటేశ్వర్లు 'ఎన్నెలనవ్వు' నవలలో యానాదుల ఆహారపు అలవాట్లు తెలియజేశారు. అలివేలు మునెయ్య పెళ్ళి భోజనాల దగ్గర కూర్చున్న వాళ్ళతో సిటికలోడు ఎవరి పాటికి వాళ్ళు భోంచేస్తున్నారు. ఓ... రే... బాపనోల్ల బంతిలా వుంది గదర ఇదే... ఆ మాటకు తింటున్న వాళ్ళు తలెత్తి చిటికిలోడు వైపు చిత్రంగా చూస్తున్నారు. ఈ పప్పు, గోంగోర... మనింటికాడ వండుకోమంటడు... ఏంకావాలో... ఏందో సెప్పరాదో...ఏందే ఈ సప్పిడి పప్పేంది. ఆ గోంగోర తొక్కేంది... మన యానాదోళ్ళ బంతంటే నాయాల్ది ఎట్టుండాల తంగేడు జింకల కూరేది. కనీసం గెనింకేకర సారన్నా వండొద్దంటా... యానోదుల బంతి భోజనాలు ప్రత్యేకంగా వుండాలన్నట్లు..... నిజానికి తంగేడు జింకలంటే ఎలుకలని, గెనంకేకర కాయలంటే ఎండ్రకాయలని, సేవల పిల్లులంటే కుందేళ్ళని యానాదులకే అర్థమౌతుంది. ఇలా ఎందుకు తమ ఆహార పదార్థాలకు మారుపేర్లు పెట్టుకోవాల్సి వచ్చిందంటే ఒకరి ఆహారపు అలవాట్లకు మరొకరు విలువ ఇవ్వరు. కిందికులాల ఆహారపు అలవాట్లను బ్రాహ్మణీయ సంస్కృతి హీనమైనదిగా ప్రచారం చేస్తుంది. అంతేకాక అసహ్యంగా చూపుతూ అంటరానితనం పాటిస్తారు.

పోలయ్య ఏటికి వెళ్ళడానికి సిద్ధమై సద్దెనీళ్ళు పొయ్యమన్నాడు. మంగమ్మ మొఖం కడుక్కొని వచ్చి పున్నీళ్ళకుండలో కుడిచేయి పెట్టి దానిలో అడుగున ఉన్న కాస్త కూడు తీసి కంచంలో ఏసి పోలయ్యకి ఇచ్చింది. కొత్త ఉల్లిపాయుంటే ఇటియ్యే.... అడిగాడు పోలయ్య. ముక్కలుకోసి ఇచ్చింది. పున్నీళ్ళకుండ యానాదులకు ఆకలి తీర్చే అక్షయ పాత్ర. పున్నీళ్ళకుండను కిందికులాల వారు దైవంగా భావించి పవిత్రంగా చూసుకుంటారు. రాత్రిపూట అన్నం మిగిలితే అన్నం, గంజి ఆ కుండలో ఉంటాయ్ కాబట్టి ఆ నీళ్లు పుల్లగ పులుస్తయ్. పులిసిన నీళ్లని పున్నీళ్ళని... అన్నాన్ని పున్నీళ్ళ బువ్వని పిలుచుకుంటారు. అన్నం లేనప్పుడు ఆ పున్నీళ్ళకుండే వాళ్ళ ఆకలి తీర్చుతుంది. అందుకే యానాదులు ఆ కుండను పూజిస్తారు. మంగళ, శుక్రవారాలో ఆ కుండను తాకరు. ఆ రోజు ఎవరికీ పున్నీళ్ళు పొయ్యరు. ఎంతో పవిత్రంగా చూసుకుంటారు.

నలుపుడు కారం ఇష్టంగా తింటారు. చేపల కూరంటే ఇష్టంగా తింటారు. మొయ్య చేపలబొడ్లు యానాది పిల్లలు ఎంతో ఇష్టంగా కాల్చుకు తింటారు. మంగమ్మ పోలయ్య తెచ్చిన చాప ముక్కల్ని తీసింది. ఆ ముక్కలతోపాటు మొయ్య చాపలబొడ్లు కూడా ఉంటాయ్. ఆ బొడ్డంటే చెంచులకి చాలా ఇష్టం. వాటిని చీపురుపుల్లకి గుచ్చి అబ్బాయ్... ఇదిగో తాత సేత కాలిపిచ్చుకో... అని చెంచులకు ఇచ్చింది. చెంచులు మొయ్య చేపలబొడ్లను చీపురుపుల్లకి గుచ్చి కాలిపించుకు తిన్నాడు. యానాదులు పాచిపని చేసి రాత్రి పాచిపోయిన అన్నాన్ని పడవేయకుండా పరమాన్నంగా భావిస్తారని రచయిత దీపావళి పండుగ నేపథ్యంలో వివరించాడు. అయితే పేదోళ్ళ కూరలకి చాలాపేర్లు ఉంటాయి. 'నలుపుడుకారం, బొటేలుచారు, దరువు, అర్జంటు అని రకరకాల పేర్లతో పిలుచుకొని యానాదులు సరదాగా నవ్వుకుంటారు. నవ్వులతో కడుపు నింపేసుకుంటారు. ఆకలి తీరని రాత్రులను నవ్వులతో నెమరేస్తూంటారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

**పండుగలు యానాదుల - వినోదాలు:** దసరా పండుగనాడు యానాదుల ఆనందానికి అడ్డు అదుపు ఉండదు. మగవారే స్త్రీ, పురుషుల వేషాలు కడతారు. కృష్ణుడు, గోపిక, శ్రీరాముడు, సీతమ్మ, వంటి పౌరాణికపాత్రలను ధరించి అంగళ్లలో తెలిసిన వారి దగ్గర, పుర ప్రముఖుల వద్ద చిందులు తొక్కి వస్త్రాలను, తిండిగింజలను బహుమానంగా సంపాదిస్తారు. ఈ సమయంలో అభినయిస్తూ రంగులు పూసుకొని కూని రాగాలు తీస్తూ వీధుల వెంబడి పురుషులు అడుతుంటారు. (రాఘువయ్య, వెన్నెలకంటి). వీరి నృత్యాన్ని 'చిందు నృత్యం' అంటారు. వీరు 'చిందు భాగవతం' ప్రదర్శించడంలో ప్రసిద్ధులని ఈ నవల ఆధారంగా చెప్పవచ్చు.

దీపావళి పండుగకు ముందు చెంచులు తుపాకీకోసం మంగమ్మను విసిగించాడు. తుపాకీ కోసం పొగాకునారు వేయడానికి వెళ్ళాడు. కానీ వచ్చిన రూపాయి కూలీతో మంగమ్మ తుపాకీ కొనకుండా సరుకులు కొనుక్కొంది. ఆకలి తర్వాతే మిగిలిన అవసరాలు తీర్చుకోవడంగా దీన్ని భావించాలి. కానీ చెంచులు తనకు తుపాకీ కావాలనే మంకుపట్టు విడవలేదు. ఆర్థిక పరిస్థితులు బాగాలేక పండగరోజు పాచిపోయిన అన్నమే తిన్నారు. ఇది యానాదుల దయనీయ పరిస్థితికి అద్దం పట్టింది. టపాసులు కొనలేక పోలయ్య తాటిగిలకలు తయారుచేసి యానాది సంఘానికంతా అందించి, అందరినీ దీపావళిలో భాగస్వాములను చేశాడు. అందుకు యానాదులందరూ పోలయ్యను మెచ్చుకున్నారు. దీపావళి అంటే దీపాలపండగ ఆ రోజు దీపాలే వెలిగించాలని కాలుష్యరహిత గిలకలను తయారుచేసి సంప్రదాయ బద్ధంగా దీపావళి పండుగ చేసుకొని ఆనందించారు.

అంతకముందు దీపావళి అగ్రవర్ణ పండుగగా పోలయ్య నోటిద్వారా రచయిత పలికించాడు. పోలయ్యపాత్రకి అంత చైతన్యం ఉన్నట్లుగా మనకు ఈ నవలలో ఎక్కడా కనబడదు. దీపావళి పండుగరోజు ఆకలికి తాళలేక, పాచిపోయిన అన్నాన్ని పడవేయకుండ పరమాన్నంగా మంగమ్మ కుటుంబమంతా తింటారు. డబ్బులను బట్టే పండుగలు డబ్బులులేని వారికి ఏ పండగైనా ఒక్కటేనని చెప్పుకోవచ్చు.

**మరణం**: యానాదులలో మంత్రతంత్రాలు, తాయత్తులు, కర్మకాండలు మొదలైన వాటిని ఆచరించే వారు కూడా ఉన్నారు. యానాదులకు వీటిపై కూడా నమ్మకం ఉంది. కానీ ధనబలం లేనందున ఆచరించరు. అతని ప్రాణానికి చావుకు మధ్య ఉండేది పాడె పుల్లలు, మోసేవాండ్లు నోచుకోక శవానికి చుట్ట చుట్టిన చినిగిపోయిన ఈతాకుల చాపే కదా! యానాదుల మరణం సమీప కాలంలో బంధువులు, కొరివి పెట్టే వారసులు, ఆత్మీయులనే వారు తరచుగా ఎవ్వరు ఉండరు. పొలాల కావిళ్లలోని శవం అట్లనే శిథిలమయ్యే దృశ్యాలు లేకపోలేదు. బంధువులకు తంతులు పంపడం, ముందుగా జాబులు రాయడం జరుగదు. తాహతు గలవాడు కర్మ చేస్తాడు. లేని వారికి అది కూడా ఉండదు. పక్కలోడు / సిటికలోడు పాముకాటుకు గురై చనిపోయే దృశ్యం హృదయ విదారక మైన అంశం. యానాదులలో పుట్టుక, పెళ్ళి, చావు విషయాలలో ఏమాత్రం ఆర్భాటాలు కనిపించవు. చాలా సామాన్యంగా జరుపుకుంటారు. ఈ

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

మధ్యకాలంలో ఆర్థికపరిస్థితులు కొంతవరకు మెరుగు పడటంతో, స్థిర నివాసాలు ఏర్పర్చుకోవడం వేడుకలు, పండుగలు చేసుకోవడం మొదలైందని చెప్పవచ్చు.

## ముగింపు:

మన జాతికి పునాదిరాళ్ళు వేసిన యానాదుల్ని మనం నిర్లక్ష్యం చేయడంలోనే జాతి అభ్యున్నతి కుంటుబడింది. కులాల కుదురులో కూరుకు పోయిన తర్వాత తెలుగుజాతి జాతీయతను కోల్పోయింది. ఇప్పటికైనా కళ్ళు తెరచి యానాదుల్లో వున్న భాష, సంస్కృతులను మనం తెలుగుజాతికి అన్వయించుకొని తెలుగుజాతిని పరిపుష్ఠం చేసుకోవల్సిన మహోన్నత చారిత్రక సందర్భం ఇది. యానాదుల జీవన దృశ్యాన్ని మనం పరిశీలిస్తే తెలుగునుడికార నిగారం తెలుగు క్రియాపదాల సొగసు మనకు తెలుస్తుంది. ఇతరులను నిందించకుండా తమ చరిత్రే తాము చెప్పుకునే జాతితత్వం యానాదులలో వుంది. ఎంత కష్టమొచ్చినా యానాది మొహంలో నవ్వు చెరిగిపోదు. అందుకే యానాదులు ఆకలి సమయంలో కూడ హాస్యమాడుకొని హాయిగా నవ్వుకుంటారు. ఆ నవ్వులతో కడుపు నింపుకొని ఆకలిని మర్చిపోవడానికి ప్రయత్నం చేస్తుంటారనవచ్చు. ఎన్నెల లాంటి నవ్వుల కోసం అంబేద్కరిజమార్గంలో రాజ్యాధికారం కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో పయనించాలని ఎన్నెలనవ్వు నవల ద్వారా యానాదుల జీవన చిత్రాన్ని ఏకుల వెంకటేశ్వర్లు మన కళ్ళ ముందు ఆవిష్కరించాడు.

## సంప్రదించిన పుస్తకాలు:

వెంకటేశ్వర్లు,2001 :ఏకుల ,'ఎన్నెలనవ్వు', బహుజన కెరటాలు ప్రచురణ, ఒంగోలు

కోటేశ్వరరావు ,కోయి: 2001 'యానాది బతుకు పేగు తెంచుకుపుట్టిన చారిత్రాత్మక నవల ఎన్నెలనవ్వు' – ముందుమాట, వెంకటేశ్వర్లు,:ఏకుల ,'ఎన్నెలనవ్వు', బహుజన కెరటాలు ప్రచురణ, ఒంగోలు చిన వీరభద్రుడు,వాడ్రేవు : 'చివరిగుడిసె' నవల ముందుమాట

రాఘవయ్య, వెన్నెలకంటి: ,1974'యానాది'.విజయవాడ,ఆంధ్ర రాష్ట్ర ఆదిమజాతి సేవా సంఘం,

లలిత, వకుళాభరణం: ,2009'ఆంధ్రప్రదేశ్ లో విముక్త జాతులు', నేషనల్ బుక్ ట్రస్ట్ఇండియా,

వెంకటేశ్వర్లు:దార్ల , ,2012 'ఎన్నెలనవ్వు-యానాదుల సంస్కృతి' బహుజన సాహిత్య దృక్పధం, సొసైటి అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ , హైదరాబాద్.